# స్నేహలత

రచన :
అద్దంకి శ్రీదేవి.

శారద యెన్ని సంవత్సరాలుబట్టి ఆ ఆఫీసులో పని చేస్తూవుందో యెప్పుడు చేరిందో వివరాలు యేమీ లతకు తెలియవు. సిన్సియర్‌గా వర్క్ చేస్తుంది, ఠంచనుగా టైముకి ఆఫీసులో హాజరవుతుంది, ఆఫీసర్లంటే వినయ విధేయతలుగా వుంటుంది, అంతకుమించి శారద పర్సనల్ లైఫ్ గురించి యెవరికీ ఎక్కువగా తెలియదు. తెల్సుకోవాలని ప్రయత్నించినవాళ్ళుకూడా చాలాకొద్దిమందే వుంటారు. శారద చాలా ముభావంగా వుంటుంది ఒకటి, రెండోది సాధ్యమయినంతవరకూ మనుష్యుల్ని తప్పించుకు తిరగాలని చూస్తుంది. శారద అంతగా ఆకర్షణీయంగా లేకపోవటంకూడా మరొక కారణమయి వుండవచ్చు. వయస్సుకు తగినంత చలాకీతనంగాని చురుకుతనంగాని లేని శారద అంటే లతకు అదోకవిధమయిన సానుభూతి. మనస్సుకి చిక్కని ఆత్మీయ భావన, అభిమానం, ఆదరించాలన్న అభిభావన లతకి తెలియకుండానే ఆమె హృదయంలో చోటు చేసుకున్నాయి. చాలామాట్లు కారణం కనుక్కుందామని నోటిదాకా వచ్చిన మాటలు శారద తీక్షణమయిన చూపుల్లో మాడిపోయేవి. చేష్టలుడిగిన రాతిబొమ్మలా నిల్చుండిపోవాల్సి వచ్చేది లత. అందరి ముందరా ప్రదర్శించే ఆఫీసరు దర్పం హోదా అన్నీ శారద ముందు మటుమాయమయ్యేవి. ఆఫీసుకి వచ్చీ రాగానే అందరూ గ్రీట్ చేసి శారద గ్రీట్ చెయ్యకపోయినా కించిత్ బాధపడదు లత. కాని ఇవాళ తను చేసిన ఆఫర్ని కాదన్నందుకు లతకు చాలా కష్టం తోచింది.

అసలేం జరిగిందంటే ఆఫీసులో అందరికన్నా ముందుగా వచ్చే శారద కొద్దిగా ఆలశ్యంగా వచ్చింది. టైపు చేసిన ప్రతి పేపర్లోనూ మూడు నాలుగు స్పెల్లింగు మిస్టేక్స్ వున్నాయి. పనిలో జాగ్రత్తగా వుండే శారద అశ్రద్ధగా వుండటం చూసి జాలేసింది లతకి. లోతుకు పీక్కుపోయిన కళ్ళు నల్లగ కప్పెర వేసిన ముఖం చూడగానే యేదో విచారకరమయిన సంఘటనే జరిగి వుంటుందని వూహించింది లత.

శారద టేబిల్ దగ్గరికి వెళ్ళి ఇవాళ మీ వంట్లో ఆరోగ్యంగా లేదా అని ప్రశ్నించింది లత.

ఒక్క క్షణం లత కళ్ళలోకి ఆశ్చర్యంగా చూసి తల దించుకుంది. సుడులు తిరుగుతున్న కన్నీళ్ళను ఆపుకోవటానికి ప్రయత్నంచేస్తూ 'నీరసంగా వుంది' అని జవాబిచ్చింది శారద.

'అలా కాంటిన్‌లోకి వెళ్ళి కాస్త కాఫీ తీసుకుందాం రండి. కాస్త వుత్సాహంగా వుంటుంది.'

'క్షమించాలి. నాకు కాఫీ అలవాటు లేదు.'

'పోనీ యేదయినా టిఫిన్ తీసుకుందురుగాని.'

'కాఫీ టిఫిన్లకి ఖర్చుపెట్టేంత పెద్ద పర్సు కాదండి నాది.'

'పర్సు విషయం మీరు ఆలోచించకండి. నాదగ్గర వున్నంతవరకూ మీకేం భయంలేదు. మీ ఖర్చుల్ని భరించే బాధ్యత నాది.'

'మీ సహాయాన్ని అందుకోవటానికి యిక్కడెవరూ సిద్ధంగా లేరు. ధనంలో మీకన్నా పేదవాళ్ళమయినా మాకూ ఆత్మాభిమానాలున్నాయి. దయుంచి యింకెప్పుడూ మీరిటువంటి మాటలు మాట్లాడవద్దు అన్నది శారద విసురుగా. ఆ ఒక్క దెబ్బతో లత మనస్సు చిన్నబోయింది. ఆప్యాయతతో పలకరించాలని వెడితే అనుకోని విధంగా శరాఘాతం తగిలింది. పుణ్యానికి పోతే పాపం యెదురయిందన్న సామెతగా వుపకారం చెయ్యబోయిన లతకి తిరస్కార భావం యెదురయింది. శారద ముందు అలా తెల్లబోయి నిలబడటం అవమానకరంగా తోచి తన టేబుల్ దగ్గరకు వెళ్ళిపోయింది. ఆఫీసు కిటికీల్లోంచి బయట ప్రపంచంలోకి చూస్తున్నా లత మనస్సులో శారద ప్రవర్తన గురించిన ఆలోచనలే ముసురుకు రావటం మొదలెట్టాయి—

'శారదకి యెంత ఆత్మాభిమానమున్నా ఫ్రెండ్లీగా కాఫీకి పిలిస్తే అంత కటువుగా మాట్లాడటం సౌమ్యంగా లేదు. మనసులో మాట తల్సుకోకుండా అయినవాళ్లనీ కానివాళ్లని అవమానించటం, తూష్ణీకార భావంతో చూడటం తగదు. ఇంకొకరితో యెంత అవసరం లేకపోయినా మంచిగా మాట్లాడాలి. తన పై ఆఫీసర్ననయినా గౌరవించలేకపోయింది. తన పిచ్చిగాని మొదటి నుంచీ శారదకి తనంటే మంచి అభిప్రాయంలేదు. తనే

ఏదో తోటి ప్రాణికదా అని ఇంటరెస్ట్ చూపిస్తుంది. అంత అహంకారం వున్నవాళ్ళని మాట్లాడించటం తనదే తప్పు-బోయ్ తెచ్చిన టీ తీసుకుంటూ శాస్త్ర తెప్పరిల్లి శారద టేబుల్ వంక కోపంగా చూసింది లత. శారద కాగితాలు సర్ది వెళ్ళిపోతూంది. ఆ ఒక్క చూపులో అసహ్యం యిమిడివుంది, హృదయాన్ని చీల్చుకుపోగల శక్తి వుంది, ఇతరుల్ని అవమానంతో దహించివేయగల సామర్థ్యం వుంది అనుకుంది లత.

శారద లీవు వ్రాయలేదు. యెవరినీ ఇంటికి వెళ్ళటానికి అనుమతి కోరలేదు. సర్వస్వతంత్రంగా, ఆఫీసర్ని నిర్లక్ష్యం చేస్తున్నట్టుగా చిన్నచూపు చూసి వచ్చేసింది. రోడ్డుమీద భారంగా అడుగులు వేస్తున్న శారదకి తను తప్పు చేస్తున్నట్టు అప్పుడు గుర్తుకి వచ్చింది. వెనక్కి తిరిగి అరమైలు నడిచి వెళ్ళే ఓపికా లేదు. బస్‌మీద వెడదామంటే డబ్బులూ లేవు-ఇవాళ తను మాట్లాడిన విధం చూస్తూంటే తనకే సిగ్గేస్తోంది. అతి జాగ్రత్తగా మాటల్ని తూచి తూచి వాడే తను నోరు జారింది. ఎవ్వరి మనస్సూ నొప్పెట్టకుండా నడుచుకునే స్వభావం తనది. కాని ఎవరిమీదో వున్న కోపాన్ని కావాలని లత మీద చూపించింది. పాపం! లత జాలిపడి సహాయం చెయ్యటానికి వచ్చిందని నోరు పారేసుకున్నాను అనుకుంది శారద.

రోడ్డుమీద పోతున్న మనుష్యులు, రిక్షాలు సిటీ బస్సులు శారద దృక్పథంలో లేవు. లత స్నేహశీలత ఇంటి గొడవలు మనస్సులో కదిలిపోతున్నాయి. మానవాతీతంగా మసలే శక్తి, ప్రపంచపు గొడవలనుంచి దూరంగాపోయే సామర్థ్యం అందరికీ వుండదు. లేనిపోని చిక్కులు కల్పించుకుని పదికాలాలపాటు ప్రపంచంలో తనపేరు నిల్చేందుకు ప్రయత్నం చేస్తాడు మానవుడు. తను చేసే పనిలో యెన్ని అడ్డంకులు తగిలినా కోలాహలాన్ని మింగిన శివునిలా ప్రవర్తించాల్సిన ఘడియలు యెదురవుతాయి. కర్తవ్యపాలన అని నిజంగా దానికి పేరుపెట్టినా-యేదో జన్మెత్తాం కాబట్టి యెన్ని కష్టాల్నయినా భరించాలి అనుకోవడంతప్పు-అంత పెద్ద పేరుతో యెవరూ పిలవరు. నలుగురూ మనపేరు చెప్పుకోవాలన్న ఆతృతతప్ప అందులో మనం ఆశించతగ్గ లాభం వుండదు. టైపిస్టుగా పనిలో చేరింది మొదలు యీ 8 సంవత్సరాలబట్టి ఓర్పుగా నేర్పుతో తన పనిని చేసుకుపోవటం అలవాటు చేసుకుంది శారద. లోకుల నిష్ఠూరాలకి, తన కష్టాలకి అంత విలువ నియ్యలేదు. తన కర్తవ్యం సంపాదించటం మతి స్థిరం లేని ఫణికి సేవ చెయ్యడం అనుకుంది. తల్లిదండ్రులు తనకి మిగిల్చిపోయిన వస్తువుల్లా రోగిష్టి ఫణి, అలుపులేని రెక్కలు.

మిట్ట మధ్యాహ్నపు యెండలో ఇంటికి చేరిన శారదకి చిన్నపిల్లల్లా క్రిందపడి శోకన్నాలు పెడుతున్న ఫణి కనిపించాడు. మనస్సులోని వాత్సల్యం హృదయంలోని జాలి ఒక్కుమ్మడిగా శారద కళ్ళలో నీళ్ళు తెప్పించాయి. ప్రేమగా క్రిందపడివున్న ఫణి చెయ్యి పుచ్చుకుంది. 'చూడు శారూ నేను మొదటి నెల జీతం అమ్మ కియ్యలేదూ! నేను బి. ఎ. ఫస్ట్ క్లాస్‌లో పాసు కాలా? నేనేం తప్పుచేసానని నన్ను అందరూ చులకనగా చూస్తున్నారు. నేను పిచ్చివాణ్ణా చెప్పు నిజంగా చెప్పు. నామీద ఒట్టువేసి చెప్పు అంటూ శారద చేతిని నెత్తిమీద పెట్టుకున్నాడు ఫణి. పేలవంగా నవ్వి ఘాడంగా నిట్టూరుస్తున్న శారద ముఖం నాకు ఆకలి మండుకుపోతూవుంది. అన్నం తింటూ చెప్తాను పద అంది ప్లేట్లు పెడుతూ.

మాట్లాడటాన్కి చేత్తో పని చెయ్యటానికి యేం సంబంధం. సమాధానం చెప్పటానికి ఇష్టం లేకపోతే సూటిగా చెప్పలేవూ అన్నాడు అన్నం పెట్టిన ప్లేటను కాలితో తంతూ. ఆఫీసులో తగూపెట్టుకు వచ్చాను, చాలా ఇంకా యేమన్నా ఇన్ఫర్మేషన్ కావాలా? అన్నది కోపంగా.

ఒక్క జీతంలో ఇద్దరం బ్రతుకుతున్నామే. ఆ బుద్ధి అయినా నీకు లేదూ. పైగా సిగ్గులేకుండా పేచీపెట్టుకున్నానని చెప్తున్నావ్? ఇటువంటి రాజా వుద్యోగం నీకు మళ్ళా యెక్కడయినా దొరుకుతుందా? ముష్టి కిరు సంపాదన లేదు నీకింత అహంభావమా? ఏం చూసుకుని ఈ మిడిసిపాటు. నా నోటిముందు కూడు పడగొట్టాలని ఎత్తా. నీ యిష్టం వచ్చినట్లు ఆడటానికి ఇక్కడ వున్నదెవరనుకుంటున్నావ్ అంటూ చేతులో వున్న రూళ్ళ కర్ర విసిరి పారేసాడు-పోయాడు.

మరో నాడయితే శారద కిమ్మనాస్తిగా వూరు కునేదే. కాని మనస్సు అసలే వ్యాకులంగా వుండటం దానికి తోడు చూసి చకితుడయ్యాడు. 'నేనేదయినా తప్పు చేసి వుంటే నన్ను క్షమించు శారదా! తప్పు చేసి వుండటం యేమిటి, ప్రొద్దుట చాలాపొరపాటు చేసాను. ఇంకోమాటు నిన్ను అటువంటి మాటలంటే చంపే సెయ్యి. అన్నం పెట్టకుండా వీధిలోకి తరిమేసెయ్యి. కాని నువుటుక్కు కోపం తెచ్చుకోబోకు. పిచ్చివాళ్లు అనేమాటలు లెక్క చేస్తారా చెప్పు. నేనేదో బుద్ది పొరపాటుపనే చేసాననుకో. నామీద అసహ్యంతో అన్నం తినటం మానేస్తావా అంటూ మళ్ళీ యేడ్పు ప్రారంభించాడు. నీమీద నాకేం కోపంలేదు నిజంగా అంటూ శారద ఫణి చెంపలు నిమిరింది.

మరి నీముఖం అలా వుందేం?

తలవని తలంపుగా పిచ్చివాడు ఇంత ప్రశ్న వేస్తాడని వూహించనుకూడా లేదు. ఆవేదనను అర్థం చేసుకోలేదు, మనస్సుని సంతోష పెట్టలేదు, బాధ్యతని తగ్గించలేదు కాని శారదను నిగ్గదీసి ప్రశ్నించగల మనోనిబ్బరం వుంది, అవసరమయితే దండించగల తాహతు వుంది. సంకట పరిస్థితినుంచి తప్పించుకోగల నాకీ శారదకుంది. శూలాల్లాంటి మాటలు పైగా రూళ్ళకర్ర దెబ్బతో యెడం చెయ్యి నొప్పి కోపాన్ని రేగొట్టాయి. నిప్పు తొక్కిన కోతిలా ఇంటినబడి అరవటం మొదలెట్టింది. స్వతహాగా మెతగ గుణంగల శారద ఇంతలేసి మాటలు అంటుందని ఫణి యెప్పుడూ వూహించలేదు. శారద హృదయంలో ఇంత దావానలం వుందనికూడా తెలియదు. తప్పు తన పై వుండటంతో పిచ్చాడు యెండలో మాట్లాడకుండా కూర్చున్నాడు. దెయ్యం పట్టిన వాళ్ళకిమల్లే రెచ్చిపోయి రెచ్చిపోయి 'నా కూడు తింటూ నామీదే అధికారం చెలాయిస్తావుగా' అని వెంటనే నాలుక కరుచుకుంది


తంతి : "ROYAL" P. B. No 9




* శ్రేష్ఠమైన రకం
* చిరకాలం మన్నిక
* తక్కువ ధర
* చక్కని అల్లిక

వగైరాలకు ప్రశస్తమైనవి.

రాయల్ బనియన్లు

తయారు చేయువారు :

రాయల్ నిట్టింగ్ కంపెనీ.,

తిరుప్పూర్ (S. Ry.)

ఏజెంట్లు:-శ్రీవెంకటేశ్వరా టెక్స్టైల్స్ కంపెని, కావలి.

With the best compliments of:-

# CHARI & RAM

**Importers and Dealers in Dyes & Chemicals.**

(Post Box No. 38)

East Gate. MADURAI. (S. India.)

*STOCKISTS ALL OVER INDIA.*

శారద. ఎంత మతిస్థిర లేనివాడయినా, ఎవరయినా తన అసమర్థతను యెత్తి చూపిస్తే సహించలేడు అవమానంతో చర్రున లేస్తు 'నేను నీకింత బరువుగా వున్నానా? సరే అయితే నాబాధ నీకేం వుండకుండా చేస్తాలే అంటూ వెళ్ళిపోయాడు.

చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకుంటే యేం లాభం? నోరు జారిన తర్వాత కాని తన తప్పు తెలిసి రాలేదు. వెనక్కి పిలిచినా ఫణిరాడు, రెండు మూడు రోజుల దాకా యింటి ముఖం చూడడు. ఇతరుల మనస్సు అనవసరంగా నొప్పిస్తే భగవంతుడు ఇటువంటి శిక్షే విధిస్తాడు అనుకుంది శారద. హితాహిత జ్ఞానం లేదు. మంచి చెడులు తెలియవు. తన కడుపుకు కూడా తినటం తెలియదు. అమాయకుడు. మాటల్లో నొప్పించాను. మాటల్తోనే మనుష్యుల మనస్సులు కలుస్తాయి. మాటలే ప్రాణ స్నేహితుల్ని విరోధులుగా చేస్తాయి. పిచ్చివాడని ఇంతవరకూ ప్రేమగా చూచినా-ఒక మాటతో కష్టం తోచింది. అసలే తెలియనివాడు యేం అఘాయిత్యం చేస్తాడో అనుకునేసరికి శారదకు కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగాయి. సంతోషంతో అమాయకంగా నవ్వుతాడు, క్రోధంలో విప్పులు చెరుగుతాడు. దుఃఖంలో గుండె బద్దలయ్యేలాగున రోదిస్తాడు—పిచ్చాడు అని పిల్లలు హేళన చేస్తూ రోడ్డు మీద పోతూవుంటే రాళ్ళు రువ్వుతారేమో అన్న ఆలోచనలతో రాత్రి నిద్రే పట్టలేదు.

ఆత్మీయతతో ఆదరించేవాళ్ళని దూరం చేసుకున్నాను. ఆవేదనను అర్థం చేసుకునే స్నేహితులే లేరు. లతకి క్షమాపణ చెప్పి అయినాసరే నాలుగు రోజులు శలవు తీసుకొని ఫణికోసం వెతుకుతామన్న ఆశతో ఆఫీసుకి వచ్చింది శారద. పేపరు చాటునుంచి లత రూక్షణ వీక్షణాలు శారదమీద ప్రసరిస్తూనే వున్నాయి. ప్రతి కక్షి విచారంగాను నీరసంగాను కనిపించేసరికి తన దురుసుతనం ప్రదర్శించకూడదని తన్ను తాను సమాధానపరుచుకుంది లత. శారద ప్రవర్తన తెల్సిన లత తప్పకుండా ఆమె క్షమాపణ కోరుతుందని ఊహించింది. ఒకటి చిన్న పొరపాటుతో ఇద్దరూ ఆజన్మ విరోధులుగా మారటం గాని ఎత్తిపొడుపు మాటలు మాట్లాడం కాని ఆమెకిష్టం లేదు. సాధ్యమైనంత సౌమ్యతగా సంభాషణ నడుపుదామని లత తనలో తనే రిహార్సల్సు వేసుకుంది.

'గుడ్ మార్నింగ్ మిస్.'

'గుడ్ మార్నింగ్ శారదా అంటూ కుర్చీ చూపించింది లత.'

'నిన్నటి నా.............

'జరిగిపోయిన దాన్ని గురించి బాధపడి క్షమాపణ కోరటం తన్ను తాను కించపరుచుకున్నట్టవుతుంది.'...

'నేను క్షమాపణ చెప్పటానికి రాలేదు. అర్జంటుగా నాకు శలవు కావాల్సి వచ్చాను.'

'జీతంమీద అయిపోయా యనుకుంటాను.'

'డబ్బు గురించిన విషయాలు మీకనవసరం.'

'అయితే నువ్వు గ్రాంటు చెయ్యడం అసంభవం. ఇదివరక్కే చాలావుంది. 'థాంక్స్ అంటూ వెళ్ళిపోయింది శారద.

లత ఇంత నిర్మొగమాటంగా మాట్లాడుతుందని ఎప్పుడూ అనుకోలేదు...నిన్నటి కోపాన్ని కడుపులో అట్టే పెట్టుకుని ఇప్పుడు లీవు గ్రాంటు చెయ్యననడం శబబా. మాటమాటకి డబ్బు విషయాల్నెత్తి కించపరచడం తగునా. నేను తనక్రింద అసిస్టెంట్ నే అవ్వచ్చుగాక. మరీ అంత చిన్న చూపా? నిన్ననంగా పారిపోయాడు ఫణి. ఎక్కడికి పోయాడో ఏమిటో చిన్నదాన్ని అందులో అడదాన్ని యెక్కడని వెతకను. అసలు శెలవే లేకపోయె. ఏమిటో శాస్త్రిగారు నేనింతలో వున్నాను. మీరు నన్ను పొగడుతున్నారు కాని అన్న శారద మాటలు లతకి ముల్లుకుల్లా గుచ్చుకున్నాయి. శారద యెంత పెడసరంగా మాట్లాడని అవుసరంలో వుంది. అవుసరం కదా అని అర్థంచటం యెరగదు.—శారద తనని ఎంత పొరబాటుగా అర్థం చేసుకుంటోంది. ఆఫీసరు గిరీ తన మీద వెలగబెడుతున్నాననుకుంటోంది కాబోలు. అంత అత్యవసరమం మే ఆ పనిని ఎవరికయినా సర్ది లీవు యిచ్చేదాన్నే. మరీ అంత కర్కోటకురాల్ననుకుంటోంది కాబోలు. అయినా ఫణి ఎవరు? పారిపోవాల్సినంత అగత్యం ఏం వచ్చింది—అని తర్కించుకుంటూన్న లతని డిస్టర్బ చేస్తూ ఫోన్ వచ్చింది. జనరల్ హాస్పిటల్ నర్సు శారదని పిలుస్తోందని తెల్సుకున్న తరువాత శారద దగ్గరకు ప్యూన్ని పంపించింది లత.

శారద టైపు చేసిన డ్రాఫ్టు అరగంట క్రితమే చెకింగ్ కి లత దగ్గరకు పంపింది. అన్యమనస్కంగా వుండి యేం తప్పులు కొట్టానో నలుగురి ఎదుటా అవమాన పరచటానికి యిప్పుడు ఈ కబురు అనుకుంటూ గదిలో అడుగు పెట్టింది.

మీకు ఫోన్ వచ్చింది అని మళ్ళీ కాగితాల్లోకి చూస్తూ కూర్చింది లత. అయినా ఆమె మనస్సంతా కళావిహీనంగావున్న శారద ముఖంకేసే వుంది. అంతర్యపు లోతులు కొలవ గలిగిన శక్తి వుంటే లత తప్పకుండా శారద విచారానికిగల కారణం తెల్సుకునేదే. ఆమె అంగీకరిస్తే లతకు ఆదరించగల తాహత వుంది, సాధ్యమూ వుంది. ఆదరణని దయగా ఆమె ఎప్పుడూ అనుకోదు. అది స్నేహధర్మం అని లత వుద్దేశం, చేతిలో వున్న ఫోనుతో సహా క్రిందపడిపోయిన శారదను చూస్తూ అచేతనురాలయిపోయింది లత. ఆమెను ఫిట్టు నుంచి తెప్పరిల్లజేసే శక్తిగాని విచారాన్ని వుపశమింపజేసే నేర్పుగాని లేవు. ధైర్యాన్ని కూడగట్టుకుని జనరల్ హాస్పిటల్ కి ఫోను చేసింది పేషెంటు పేరు ఫణి. లారీ యాక్సిడెంటు జరిగింది. అతని దగ్గరవున్న యడ్రసు బట్టి మీకు ఫోను చేసాం అన్నది నర్సు సమాధానమిస్తూ.

ప్రమాదస్థితా?

చెప్పలేము. పెద్దాపరేషను జరిగితే బ్రతకవచ్చనే ధైర్యం వుంది.

ఆలశ్యం చెయ్యబోకండి. మనీ పంపిస్తాను.

పేషంటును చూడవచ్చా?

ఇప్పుడుకాదు.

మీ పేరు?

ఎవరయినా అడిగితే లత అని చెప్పండి. చాలు అన్నది ఫోను పెట్టేస్తూ.

మూడు రోజుల తరువాత శారద లతని పర్సనల్ గా కల్సుకుంది. లతమీదున్న వెనకటి అభిప్రాయాన్ని మార్చుకుని లతలో క్రొత్తదనాన్ని చూడాలన్న అభిలాషతో వచ్చింది.

ఫణి కులాసాగా వున్నాడా శారదా?

ఏదో మీ అనురాగంవల్ల ఈ పాటి ఆరోగ్యం చేకూరింది. నేనేమయినా తెలియక తప్పులు చేస్తే క్షమిస్తారని తలుస్తాను. మీరు డాక్టరుగార్కి పంపిన డబ్బు పంపిన బదులు ఈ గొలుసు...........

నీ దగ్గరే అట్టేపెట్టు శారదా. మనం ఎక్కడెక్కడ వుట్టామో తెలయదు ఇక్కడ కల్సుకున్నాము. నిన్ను చూస్తే ఆత్మీయుత ఏర్పడింది. కష్టాల్లో వున్నావు కదా అని సహాయం చెయ్యబోతే తిరస్కరించావు. అవమానకరంగా మాట్లాడావు. అయినా నీతో స్నేహం నాకు చాలా యిష్టం. డబ్బుకు ప్రతిఫలంగా కోరేది స్నేహమే.

మీకు నా మనస్తత్వం యీ పాటికి అర్థమయి వుండాలి.

స్నేహితులకిచ్చిన డబ్బు మళ్ళీ తీసుకుంటారా? చెప్పు శారదా?

ఆ గొలుసు ఆత్మాభిమానం కలవాళ్ళ మెడలోనే బాగుంటుంది అంటూ మెడలో వేసింది.

నువ్వు చాలా పెంకిపిల్లవు లతా.

ఇప్పటికయినా తెలుసుకున్నావు. అదే పదివేలు అంటు టీ అందించింది లత.